క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాల నివారణ



రహదారి భద్రతపై సూచనలిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్ ఆదేశాలపై మంగళవారం ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు, సిబ్బందితో కలిసి స్థానిక ప్రైవేటు పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనలు, రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను విద్యార్థులకు దృశ్య రూపంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ ట్రాఫిక్ నియమ నిబంధనలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రహదారిపై నడిచే సమయంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తతో ఎటువంటి ప్రమాదాలకు గురి కాకుండా గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు. హెల్మెట్ ఉపయోగంపై కుటుంబ సభ్యులకు విద్యార్థులు తెలియజేయాలన్నారు.

శశికుమార్‌పై మరో బాలిక ఫిర్యాదు

ఏలూరు టౌన్: ఏలూరు అమీనాపేట శ్రీదయానంద సరస్వతి బాలికల వసతి గృహం వార్డెన్ భర్త శశికుమార్ బాలికలపై లైంగిక దాడులకు పాల్పడ్డాడంటూ తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆయనపై ఇటీవల ముగ్గురు బాలికలు, తాజాగా మరో బాలిక అతనిపై ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చింతలపూడి మండలంలోని ఒక బీసీ హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్న బి.శశికుమార్ ఏలూరు గ్రీన్‌సిటీలో నివాసం ఉంటున్నాడు. అతని భార్య ఏలూరు అమీనాపేటలోని దయానందసరస్వతి బాలికల వసతి గృహానికి వార్డెన్‌గా పనిచేసేది. భార్య పనిచేస్తున్న వసతి గృహానికి తరుచూ వస్తూ బాలికలకు మాయమాటలు చెప్పి లైంగిక దాడులకు పాల్పడ్డాడని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో అతనితో పాటు భార్య, మరో యువతిని పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల మరో బాధిత బాలిక తాజాగా మంగళవారం ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏలూరు టూటౌన్ పోలీసులు శశికుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సీఆర్‌ఆర్‌లో లైఫ్ సేవింగ్ స్కిల్స్‌పై సదస్సు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని సీఆర్‌ఆర్ పీజీ కళాశాలలో బుధవారం లైఫ్ సేవింగ్ స్కిల్స్, సీపీఆర్ చేసే విధానంపై వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు కళాశాల యాజమాన్య ప్రతినిధులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఫస్ట్ ఎయిడ్ ట్రైనర్ చిన్ని సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు సీపీఆర్ చేసే విధానంపై అవగాహన కలిగిస్తారన్నారు. ఉదయం 11 గంటలకు పీజీ కళాశాలలోని సెమినార్ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

వన్‌టౌన్‌లోని రోడ్లపై గుంతలను పూడ్చాలి

ఏలూరు (టూటౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని ఒకటవ పట్టణం వైఎంహెచ్‌ఏ హాల్ ఎదుట పూల కొట్టు వద్ద రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని, ఆ ప్రాంతంలో రోడ్లను అభివృద్ధి చేయాలని బీజేపీ నాయకులు మంగళవారం ఏలూరు మున్సిపల్ కమిషనర్ ఎ.భాను ప్రతాప్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతాల్లో పలు రోడ్లు గుంతలతో దర్శనమిస్తున్నాయని తక్షణం వాటిని పూడ్చివేయాలని కోరారు. దీనిపై ఏలూరు మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్ సానుకూలంగా స్పందిస్తూ అతి త్వరలోనే రోడ్ల మరమ్మతుల కార్యక్రమాన్ని చేపడతామని తెలియజేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఏలూరు అసెంబ్లీ కో కన్వీనర్ బాడిత నారాయణరావు, సీనియర్ నాయకులు నేరుసు నెలరాజా, ఓబీసీ మోర్చా జోనల్ ఇన్‌చార్జ్ లక్కోజు అనిల్ ఆచార్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాదచారులకు దారేదీ?

- కనుమరుగవుతున్న ఫుట్‌పాత్‌లు
- నగరంలో ప్రధాన రహదారుల వెంబడి ఆక్రమణదారుల తిష్ట
- రోడ్డుకు నగం వరకూ టెంట్లు వేసి వ్యాపారాలు
- ఆక్రమణలు తొలగించాలని ప్రయాణికుల వేడుకోలు



రామచంద్రరావు పేటలో రహదారిని మూసివేసేలా డేరాల ఏర్పాటు



వసంతమహల్ వంతెన వద్ద పండ్ల వ్యాపారుల ఆక్రమణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో ఫుట్‌పాత్‌లు కనుమరుగవుతున్నాయి. ప్రధాన రహదారులన్నీ ఆక్రమణకు గురయ్యాయి. వివిధ వ్యాపారాలు చేసుకునే వారు ఫుట్‌పాత్‌లపైనే తమ దుకాణాలు ఏర్పాటు చేసుకుని పాదచారులకు నడిచే మార్గం లేకుండా చేస్తున్నారు. దీనితో ఆయా రహదారుల వెంట అత్యంత వేగంగా వెళ్లే వాహనాల వల్ల పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాల బారిన పడి గాయాలపాలవుతున్నారు. అయినా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు నగర ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌ఆర్‌పేటలో దారుణ పరిస్థితి

స్థానిక రామచంద్రరావు పేట ప్రధాన రహదారిలో సర్వజన ఆసుపత్రి ఎదురుగా ఫుట్‌పాత్‌పై ప్రారంభమైన ఆక్రమణలు వేంకటేశ్వర స్వామి దేవస్థానం వరకూ ఉన్నాయి. వ్యాపారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కేవలం ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకోవడంతో సరిపెట్టుకోకుండా వ్యాపారులు డేరాలను కట్టి వాటిని రహదారికి నగం వరకూ విస్తరించడంతో ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలకు సిబ్బంది పడుతున్నారు. వేంకటేశ్వర స్వామి దేవస్థానం దాటిన నుంచి వివిధ దుకాణాల వ్యాపారులు వారు విక్రయించే వస్తువులను, ప్రకటనల బోర్డులను రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేశారు. దీంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. వేంకటేశ్వర స్వామి దేవస్థానం దాటిన తరువాత రహదారి పూర్తిగా ఛిద్రమై వాహన చోదకులు తమ వాహనాలను అదుపు చేయలేక రహదారిపై నడిచి వెళేవారిని ఢీకొంటున్న ఘటనలూ జరుగుతున్నాయి.

పండ్ల బండ్లతో ఇరకాటం

ఒన్‌టౌన్‌లోని మెయిన్ బజారులో సైతం ఫుట్‌పాత్ ఆక్రమణలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా చందన బ్రదర్స్ ప్రాంతంతో పాటు బిర్లాభవన్ వరకూ ఫుట్‌పాత్ కానరావడంలేదు. అరటి పండ్ల బండ్లు, వివిధ రకాల పండ్ల బండ్లు ఏర్పాటు చేసి రహదారిని మూసివేస్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రతి రోజూ కొల్లేరు, పెదపాడు, దెందులూరు, పెదవేగి ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలతో పాటు నగర ప్రజల సంచారం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇలా పండ్ల బండ్లతో రహదారులు కుచించుకుపోవడంతో పాదచారులకు నరకప్రాయంగా మారుతోంది.

వంతెనలనూ వదలని వ్యాపారులు

ఇదిలా ఉండగా నగరంలోని పలు వంతెనలనూ వ్యాపారులు ఆక్రమించుకుంటున్నారు. స్థానిక వసంత మహల్ వద్ద ఉన్న కృష్ణాకాలువపై ఉన్న వంతెన, స్థానిక పాత బస్టాండు వద్ద ఉన్న వంతెనలపై పండ్ల వ్యాపారులు తిష్ట వేసుకున్నారు. ఈ వంతెనలపై నిత్యం రద్దీగా ఉన్నప్పటికీ వ్యాపారుల వద్ద పండ్లు కొనుగోలు చేయడానికి ఆగే వాహన చోదకులు, ఇతర ప్రజలతో కిక్కిరిసి వంతెన దాటాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. వెంటనే అధికారులు చర్యలు చేపట్టి వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపి పాదచారులకు నడిచే వెసులుబాటు కల్పించాలని కోరుతున్నారు.

కలెక్టర్‌ను కలిసిన నర్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



కలెక్టర్ వెట్రిసెల్వికి మొక్క అందజేస్తున్న నర్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఏలూరు(మెట్రో): ఏపీ నర్సింగ్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు కలెక్టర్ కె.వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఏపీ నర్సింగ్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షురాలిగా దంపనబోయిన అనూష, కార్యదర్శిగా ఎం.లీలారాణి, మరికొందరు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. వీరు మంగళవారం ఏపీఎన్‌జీవోస్ ఉమ్మడి పశ్చిగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చోడగిరి శ్రీనివాస్, నెరుసు రామారావుతో కలిసి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎం.దయవతమ్మ, జిల్లా ఈసీ మెంబెర్స్ కన్యాకుమారి, మాధవి, జిల్లా ఎన్‌జీవో కార్యదర్శి జి.నాగమణి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి




ఏలూరు పంపుల చెరువు వద్ద పుట్టలో పాలుపోస్తున్న భక్తులు



ఏలూరు పోస్టల్ కాలనీలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు



నాగప్రతిమలకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



ఏలూరు పోలీస్ లైన్‌లో పుట్ట వద్ద పూజలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నాగుల చవితి పండుగను మంగళవారం నగర ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కార్తీక శుద్ధ చవితి పర్వదినం సందర్భంగా స్థానిక పోస్టల్ కాలనీలోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం, స్థానిక పవర్ పేట కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానాల్లో స్వామివార్లకు ప్రత్యేక అభిషకాలు నిర్వహించారు. తెల్లవారు జామున 4 గంటల నుంచే ప్రజలు పలు ప్రాంతాల్లోని పుట్టల వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం, జిల్లా పరిషత్ కార్యాలయం, స్థానిక అమీనాపేటలోని సుబ్రహ్మణ్యేశ్వరుని పుట్ట, కృష్ణా కాలువ గట్టు వెంబడి, పంపుల చెరువు గట్టు వెంబడి ఇలా పుట్టలున్న ప్రతి చోటా భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టల వద్ద వరి పిండితో ముగ్గులు వేసి పసుపు, కుంకుమలతో అలంకరించి అనంతరం పుట్టలో ఆవు పాలు పోసి భక్తి శ్రద్ధలతో నమస్కరించారు. అలాగే పుట్టలో పాలతో పాటు చిమ్మిలి, చనిమిడి, వడపప్పు, కోడిగుడ్లు, తేగల ముక్కలు, తాటిబుర్ర గుజ్జు తదితర పదార్థాలను నాగులకు నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా పిల్లలు, యువతీ,యువకులు పుట్టల వద్ద బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

ఏలూరు జీజీహెచ్‌లో భద్రతా ఆడిట్



ఏలూరు జీజీహెచ్‌లో భద్రతా ఆడిట్‌ను నిర్వహిస్తున్న ఏఆర్‌డీఎస్పీ వీజీ శ్రీహరి

ఏలూరు టౌన్: ఆసుపత్రుల్లో పనిచేసే మహిళా డాక్టర్లు, ఆరోగ్య సంరక్షణ సహాయకులు, కార్మికులకు సురక్షితమైన వాతావరణాన్ని, రక్షణను కల్పించాల్సిన బాధ్యతను సంబంధిత ఆసుపత్రి ఉన్నతాధికారులు తీసుకోవాలని ఏఆర్ డీఎస్పీ వీజీ శ్రీహరి చెప్పారు. ఆసుపత్రుల్లో మహిళా డాక్టర్లు, ఆరోగ్య సంరక్షణ సహాయకులు, కార్మికుల రక్షణ పరిశీలనకు నియమించిన కమిటీ సభ్యులు మంగళవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో భద్రతా ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీహరి మాట్లాడుతూ హింసాత్మక సంఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కమిటీని నియమించారని చెప్పారు. ఈ కమిటీ సభ్యులు ఆసుపత్రుల్లో మహిళా డాక్టర్లు, ఆరోగ్య సంరక్షణ సహాయకులు, కార్మికులకు ఏర్పాటుచేసిన రక్షణ చర్యలపై భద్రతా ఆడిట్ నిర్వహించి నివేదిక సమర్పిస్తారన్నారు. ఆసుపత్రి ఆవరణలోకి అనవసరంగా వచ్చే ఆకతాయిలను కనిపెట్టాలని, ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఆసుపత్రిలోని వచ్చే వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు ఆసుపత్రిలోని ప్రవేశిస్తే వెంటనే ఆసుపత్రి ఉన్నతాధికారులకు లేదా 112 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. జిల్లా ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ షియాజీ, కమిటీ సభ్యులు డివిజినల్ పౌర సంబంధాల సీహెచ్.దుర్గాప్రసాద్, డాక్టర్ పద్మజా రాణి, డాక్టర్ వి.శారద, డాక్టర్ షేక్ హాఫీజా, కలెక్టరేట్ సూపరింటెండెంట్ విజయకుమార్ రాజు, రాధాకృష్ణ, శేషకుమార్, జిల్లా ఫైర్ ఆఫీసర్ రాధాకృష్ణ, పోలీసు సిబ్బంది ఉన్నారు.అనంతరం డీఎస్పీ శ్రీహరి కమిటీ సభ్యులతో కలిసి ఏలూరులోని ఆంధ్రా ఆసుపత్రిని సందర్శించి, ఆసుపత్రిలో మహిళా వైద్య సిబ్బంది రక్షణకు తీసుకుంటున్న చర్యలు, సీసీ కెమెరాలు పనితీరు, మహిళా వైద్య సిబ్బంది విశ్రాంతి ప్రదేశాలు, తదితరాలు పరిశీలించి, మహిళా వైద్య సిబ్బందికి తీసుకోవలసిన రక్షణ చర్యలపై ఆసుపత్రి సిబ్బందికి సూచనలు చేశారు.

బీజేపీ సభ్యత్వాన్ని వేగవంతం చేయాలి



బీజేపీ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సభ్యత్వ నమోదు రిటర్నింగ్ అధికారి రేలంగి శ్రీదేవి

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని పార్టీ రిటర్నింగ్ అధికారి రేలంగి శ్రీదేవి పిలుపు నిచ్చారు. భారతీయ జనతా పార్టీ ఏలూరు జిల్లా సంఘటన్ పర్వ్ 2024 జిల్లా స్థాయి కార్యశాల ఏలూరు నగరంలోని స్థానిక కొత్త బస్టాండ్ వద్ద ఓ ప్రైవేటు భవనంలో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీదేవి ఏలూరు జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదు ప్రక్రియ కొనసాగింపు, క్రియాశీలక సభ్యత్వాల నమోదు, పార్టీ సంస్థాగత ఎన్నికల ఏర్పాట్లపై విస్తృత సమీక్ష నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు సీహెచ్.విక్రమ్‌కిషోర్, జిల్లా సభ్యత్వ ప్రముఖ్ శరణాల మాలతీరాణి, అసెంబ్లీ కన్వీనర్లు పాల్గొన్నారు.

అత్యవసర మందులపై జీఎస్టీ ఎత్తివేయాలి



మహాధర్నా గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఏపీ సేల్స్ మెడికల్ రిప్రజెంటేటివ్ యూనియన్ నేతలు

ఏలూరు (టూటౌన్): అత్యవసర, నిత్యావసర మందులపై జీఎస్టీని ఎత్తివేయాలని, ఏపీ సేల్స్ మెడికల్ రిప్రజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వీవీఎస్ ప్రసాద్ తెలిపారు. ఫార్మా రంగంలో పనిచేస్తున్న మెడికల్ రిప్రజెంటేటివ్స్‌కు కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ నవంబర్ 7న విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం యూనియన్ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందుల కంపెనీలు, భారత ప్రభుత్వం, మెడికల్ యూనియన్‌తో కలిసి కమిటీని నడపాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకు విజయవాడలో ధర్నా చౌక్ వద్ద నవంబర్ 7న మహా ధర్నా నిర్వహిస్తామని ప్రసాద్ తెలిపారు. ఈ ధర్నాలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు బీవీ సత్యనారాయణ, ఉమా మహేష్, వేణు పాల్గొన్నారు.

26న బహుజన సేన ప్రథమ వార్షికోత్సవం

ఏలూరు (టూటౌన్): భారత రాజ్యాంగం ఆమోద దినోత్సవం, బహుజన సేన ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 26న సాయంత్రం 6 గంటలకు ఏలూరు 3వ డివిజన్ నవాబుపేటలో ఏర్పాటు చేసిన బహుసేన సేన కార్యక్రమాలకు సంబంధించి ఆహ్వాన కరపత్రాలను ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మంగళవారం ఆవిష్కరించారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు మత్తే బాబి మాట్లాడుతూ బహుజన సేన ప్రథమ వార్షికోత్సవం పురస్కరించుకొని ముఖ్య అతిథి బడేటి చంటి చేతుల మీదుగా వృద్ధులకు చీరలు, దుప్పట్లు, వికలాంగులకు వస్త్రదానం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బొద్దాని శ్రీనివాస్, మత్తే కుమార్, అర్జా రవికుమార్, జాలా బాలాజీ, మావూరి పరమేశ్వరరావు పాల్గొన్నారు.

ఆధునిక వైద్య విధానాలపై అవగాహన సదస్సు



అవగాన సదస్సులో మాట్లాడుతున్న వైద్యుడు నాగరాజు

ఏలూరు (టూటౌన్): అంతర్జాతీయ ప్రోస్తెటిక్స్ - ఆర్థోటిక్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం ఆధునిక వైద్య విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏలూరు దొండపాడులోని ఉమా ఎడ్యుకేషనల్ - టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ విభాగంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ నాగరాజు (హెచ్.ఓ.డి), డాక్టర్ నవ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ ప్రోస్తెటిక్స్, ఆర్థోటిక్స్ సేవల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు, అవగాహన పెంచడానికి నవంబర్ 5న అంతర్జాతీయ ప్రోస్తెటిక్స్ మరియు ఆర్థోటిక్స్ డే జరుపుకుంటారన్నారు. అనంతరం సంస్థ కో ఆర్డినేటర్ డి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా 36 ఏళ్లుగా ఎంతో మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందించామన్నారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా దివ్యాంగులకు అవసరమైన సేవలు అందిస్తామన్నారు. వాటిలో కృత్రిమ అవయవాలు, ఫిజియోథెరపీ, ఆడియోలజీ, స్పీచ్ థెరపీ, యూడీ ఐడీ తదితర సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. వివరాల కోసం 08812 -249297, 7386565469లో దివ్యాంగులు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి అచ్యుత్‌కు సర్టిఫికెట్ల అందజేత

ఏలూరు టౌన్: విద్యార్థులు, యువత పక్షాన పోరాటం చేసేందుకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ముందు ఉంటుందని, బాధిత విద్యార్థి చేబోయిన అచ్యుత్‌కు సర్టిఫికెట్లు అందజేయటంలో విద్యార్థి సంఘాలు విజయం సాధించాయని వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ వైఎస్‌వీ శివరావు తెలిపారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని, యూత్ కాంగ్రెస్ నాయకులు సతీష్‌తో కలిసి సోమవారం రాత్రి కాలేజీ యాజమాన్యం మంజూరు చేసి సర్టిఫికెట్లను అందజేశారు. ఏలూరు నగరంలోని ఎన్‌ఆర్‌పేటలో ఒక ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదివిన విద్యార్థికి సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధింపులకు గురిచేయటంతో గత నెలలో విద్యార్థి అచ్యుత్ కాలేజీ ప్రాంగణంలోనే పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో శివరావు, కాకి నాని ఆధ్వర్యంలో విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల వద్దకు వెళ్లి న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. విద్యార్థి సంఘాల నాయకులపై ఏలూరు త్రీటౌన్‌లో కాలేజీ యాజమాన్యం ఫిర్యాదు చేయగా, కేసులు నమోదు చేశారు. సర్టిఫికెట్లు ఇచ్చే వరకూ అండగా నిలబడిన విద్యార్థి సంఘాల నాయకులకు అచ్యుత్ కృతజ్ఞతలు తెలిపాడు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	15
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	31

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	16
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	23
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	18
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	19
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	19
ఏలూరు - తిరుపతి	16.00	4830	20

మొగల్తూరు ఏఈఈకి పదోన్నతి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ భీమవరం ఆపరేషన్ సర్కిల్ పరిధిలోని మొగల్తూరులో ఆపరేషన్స్ ఏఈఈగా పని చేస్తున్న ఎం.శివప్రసాద్‌కు డిప్యూటీ ఈఈగా పదోన్నతి కల్పిస్తూ ఆ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన శివప్రసాద్‌ను ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలోని నల్లజర్ల డిప్యూటీ ఈఈగా బదిలీ చేశారు. ప్రస్తుతం నల్లజర్లలో ఆపరేషన్స్ డిప్యూటీ ఈఈగా పని చేస్తున్న జే. రామును శ్రీకాకుళం కమర్షియల్ డిప్యూటీ ఈఈగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉద్యోగులకు శిక్షణ

దెందులూరు: గ్రామీణ అభివృద్ధి లక్ష్యాల సాధన ప్రభుత్వ నిబంధనల అమలులో శిక్షణ దెందులూరు మండలం నుంచి ఆరుగురు ఎంపికయ్యారని దెందులూరు ఎంపీడీఓ కె.శ్రీదేవి తెలిపారు. తాను ఈఓపీఆర్‌డీ, ఇద్దరు డిజిటల్ అసిస్టెంట్లు, ఇద్దరు గ్రామ కార్యదర్శుల శిక్షణకు ఎంపికయ్యారని గురువారం నుంచి ఏలూరులో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. శిక్షణకు వెళ్లే ఉద్యోగులకు సమాచారాన్ని అందజేశామ తెలిపారు.

8న బీకేఎంయూ జిల్లా సమావేశం

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) ఏలూరు జిల్లా సమితి విస్తృతస్థాయి సమావేశం ఈ నెల 8న శుక్రవారం ఉదయం 10.30 గంటలకు కామవరపుకోటలో నిర్వహించనున్నట్లు బీకేఎంయూ ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బండి వెంకటేశ్వరరావు, కుంచే వసంతరావు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. కామవరపుకోటలో ద్వారకాతిరుమల వెళ్లే రోడ్డులోని గ్రోమోర్ ఎరువుల కొట్టు బిల్డింగుపై భాగంలో సమావేశం నిర్వహించనున్నట్టు వారు పేర్కొన్నారు. సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తామని నాయకులు తెలిపారు.

తపాలా శాఖ ద్వారా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్

ఏలూరు (టూటౌన్): భారత ప్రభుత్వం తపాలా శాఖ అనుబంధ సంస్థ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ద్వారా పోస్టుమాన్ ద్వారా ఇంటి వద్దనే డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్స్ (జీవన్ ప్రమాణ్ లైఫ్ సర్టిఫికేట్స్) సమర్పించే సదుపాయం కల్పించబడిందని ఏలూరు డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్స్ ఎస్ శ్రీకర్ బాబు మంగళవారం పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం, అనుబంధ సంస్థల పెన్షన్‌దారులు మీ సమీప తపాలా కార్యాలయంలో, డోర్ స్టెప్ రిక్వెస్ట్ ద్వారా వారి ఇంటి వద్దనే పోస్ట్‌మేన్ ద్వారా సమర్పించవచ్చునన్నారు. డోర్ స్టెప్ రిక్వెస్ట్ కోసం గూగుల్ ప్లే స్టోర్‌లోని పోస్ట్ ఇన్‌ఫో యాప్ ద్వారా రిక్వెస్ట్ పెడితే సంబంధిత పోస్టుమాన్ ఫోన్ చేసి సర్వీస్ అందజేస్తారన్నారు. వివరాలకు ఏలూరులోని బ్రాంచి మేనేజర్ కె.రాజేష్‌ను సంప్రదించాలని తెలిపారు.